విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 26, జూన్ 2025

విధుల పట్ల
ఇంత నిర్లక్ష్యమా..

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని మందలూరు గ్రామంలో ఉన్న హెల్త్, వెల్నెస్ సెంటర్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బుధవారం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యానికి తూట్లు పొడిచే విధంగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్నం 1గంట దాటిన వెల్నెస్ సెంటర్ తలుపులు తెరుచుకోలేదు ఉదయం 10 గంటల నుండి విధులకు హాజరైన ఆశా కార్యకర్తలు సెంటర్‌కు వచ్చి తలుపులు తెరచుకోకపోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచక ఉదయం నుండి అక్కడే కూర్చొని పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. వైద్య సేవలకై వచ్చిన గ్రామస్తులకు ఏమి చెప్పాలో తెలియక అయోమయంలో పడ్డారు. గ్రామంలోని వ్యవసాయ రైతులకు సేవలను అందించాల్సిన అగ్రికల్చరల్ అసిస్టెంట్ విధులకు రాకపోవడంతో రైతులు వెనుదిరిగారు. పర్యవేక్షణ లోపం వల్లనే సిబ్బంది విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం నందు బుధవారం సంబంధిత అధికారులతో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 26న నిర్వహించడం జరుగుతుందని, మాదక ద్రవ్యరహిత సమాజాన్ని సాధించడం కొరకు జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల సహకారాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలపై దిశ నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్. రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, జిల్లా వైద్యశాఖాధికారి వెంకట రమణ, ఉమెన్ అండ్ చైల్డ్ డైరెక్టర్ లీలావతి, నంద్యాల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ కింద అక్రమ బంకులను తొలగించాలి

విశాలాంధ్ర-డోన్ : పట్టణంలోని ఫ్లైఓవర్ కింద అక్రమ బంకులను తొలగించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఐటీయూసీ చిన్న వ్యాపారస్తుల సంఘం (తోపుడు బండ్లు) ఆధ్వర్యంలో ఫ్లవర్ కింద అక్రమ బంకులను తొలగించాలని నిరసన చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గం అధ్యక్ష,కార్యదర్శులు అన్వర్ అబ్బాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ ఫ్లైఓవర్ కింద ఎన్నో సంవత్సరాలుగా తోపుడు బండ్ల ద్వారా జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలు తోపుడుబండ్లపై పండ్ల వ్యాపారము పూల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. తోపుడు బండ్ల వారు ఉదయ దొబ్బుడు బండ్లపై వ్యాపారం చేసి యధావిధంగా సాయంత్రము తోపుడుబండ్లను ఇంటికి తీసుకొని పోవుచున్నారన్నారు. ఆ క్రమంలో అక్రమార్కులు రాత్రికి రాత్రి అక్రమంగా బంకులను తోపుడు బండ్ల స్థలాలలో ఆక్రమించడం వలన తోపుడు బండ్లు వారికి వ్యాపారానికి నష్టం కలుగుతుందన్నారు.ట్రాఫిక్ కూడా ఇబ్బంది కలుగుతుందని అక్రమంగా బంకులో వేసిన వారిపై చర్యలు తీసుకొని తోపుడు బండ్ల స్థలాలలో వేసుకున్న అక్రమబంకులు తొలగించాలన్నారు. అనంతరం చిన్న వ్యాపారస్తుల సంఘం (తోపుడు బండ్ల సంఘం)వారికి మున్సిపాలిటీ అధికారులు స్థలాలు కేటాయించాలని వారు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, టౌన్ సిఐ ఇంతియాజ్‌కు వినతి పత్రం అందజేశారు. తోపుడు బండ్ల సంఘం యూనియన్ నాయకులు రవి,రాజు,శీను, తాయేష్, అశోక్, మౌలాలి,యూనియన్ నాయకురాళ్లు పకీరమ్మ, దుర్గమ్మ, మహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మె జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర - డోన్ : కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు జూలై 9న జరుగుతున్నటువంటి దేశవ్యాప్త సావత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య ఉద్యోగ కార్మికులకు ప్రకటనలో బుధవారం పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక కార్మిక హక్కుల హరిస్తు 44 కార్మిక సంక్షేమ చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికులు యూనియన్ పెట్టుకోకుండా సంఘ నిర్మాణం చేసుకోకుండా కార్మిక హక్కులు సాధించేందుకు సమ్మెను చేయకుండా చూడాలనుకోవడం దారుణమ న్నారు. కనీస వేతనాలు అడిగేటువంటి బేరసారాలను మొత్తం కార్పొరేట్ పెట్టుబడుదారుల కబంధ హస్తాలలోకి నెట్టి కార్మికులను బానిసలుగా చేసే దుర్మార్గమైన చట్టాలు తీసుకురావడం కేంద్ర ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంపన్న వర్గాలు ఆదాని, అంబానీ లాంటి ఆర్థిక దోపిడీదారులను శ్రమ దోపిడి దారులను అడ్డుకొని అంతం చేసేందుకు ఏఐటియుసి ఎర్రజెండా నాయకత్వంలో కార్మికులు ఉద్యోగ సంఘాలను కలుపుకొని జులై 9నఉద్యోగ కార్మిక మహా పోరాటాన్ని చేయడానికి సన్నద్ధం చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కార్మికులంతా ఏకమై ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన డీఐపీఆర్‌వో..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్‌ఓ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.పురుషోత్తం బుధవారం కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన డిఐపిఆర్‌ఓకు కలెక్టరు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తూ సమాచార శాఖ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సస్యరక్షణలో మెలకువలు పాటించాలి

విశాలాంధ్ర - మిడుతూరు : సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడును సాధించవచ్చుని నందికొట్కూర్ ఏడిఏ విజయ శేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని 49బన్నూరు, చౌట్కూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులపై దృష్టిసారించాలని సూచించారు. ఏవో పీరు నాయక్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం సంబంధించిన మొదటి విడత డబ్బులు, పీఎం కిసాన్ పథకం డబ్బులతో జమ చేస్తారని తెలిపారు. ప్రతి రైతు ఈ కేవైసీ, 2025 ఖరీఫ్ సీజన్లో సాగు చేపట్టిన పంటల పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మల్లికార్జున రెడ్డి, ఆయా గ్రామాల రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు మృతిపై సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఈ నెల 14న ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన శ్రీనివాసులు(20) అనే యువకుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టి, కుటుంబానికి న్యాయం చేయాలని అఖిల భారత రజక సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనీల్‌కుమార్ రజక డిమాండ్ చేసారు. బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులు ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని సమగ్ర విచారణ చేపట్టి కుటుంబానికి తగిన న్యాయం చేయాలన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ,మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి దృష్టికి తీసు కెళ్ళగా తగిన న్యాయం చేసి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామి ఇచ్చారన్నారు. గ్రామగ్రామాన రజకులు సంఘాలను ఏర్పాటు చేసుకొని సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత ప్రతి రజకుడిపై ఉందన్నారు. అనంతరం చాగలమర్రి పోలీస్ స్టేషన్కు చేరుకుని ఎస్‌ఐకి వినతి పత్రాన్ని అందజేసారు. అఖిల బారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి కంబగిరి స్వామీ, ఉపాధ్యక్షులు బాలుడు, రమణ, ఆళ్ళగడ్డ మండల అధ్యక్షుడు ఆదినరసింహులు పాల్గొన్నారు.

సహకార సంఘం గోదాములు పరిశీలన

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని రుద్రవరం ప్రస్తావైపు ఉన్నటువంటి సహకార సంఘం గోదాములను ఎంపి ఎఫ్‌సి గోదాముల డిసిఓ ఎస్.రామాంజనేయులు ఇతర అధికారులు శిరివెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ సీఈవో మీర్జా మహబూబ్ బేగ్ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. ధాన్యం స్టాక్ పాయింట్‌కు అణువుగా ఉన్న గోదాములను అన్నదాతలు వ్యాపార సంస్థలు సద్వినియోగం చేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకుంటా మని రామాంజనేయులు పేర్కొన్నారు. గోదాముల పెండింగ్ పనులు ఏవైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేసి స్థానిక రైతులు వ్యాపారులు సద్వినియోగం చేసుకునేలా గోదాములను తీర్చిదిద్ది సద్వినియోగం చేసుకునేలా ఆయా సొసైటీ సీఈఓలు సిబ్బంది కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘ పిఐసి మురళీకృష్ణ ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ సీనియర్ ఇన్స్పెక్టర్ ప్రకాష్ భాష సంఘ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం కేసు నమోదు

విశాలాంధ్ర-గడివేముల : మండల పరిధిలోని గని గ్రామానికి చెందిన లేట్ నాగ రంగస్వామి భార్య శ్రీదేవి కుమార్తె మంగళవారం నుండి కనబడటం లేదని తల్లి శ్రీదేవి గడివేముల పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు మంగళవారం ఉదయం బాధితురాలు తల్లి శ్రీదేవి అంగనవాడిలో ఆయాగా పనిచేస్తున్నారు. డ్యూటీకి వెళ్లే సమయంలో తన కూతురు ఇంటిలో ఉన్నదని సాయంత్రం డ్యూటీ ముగించుకొని శ్రీదేవి ఇంటికి వచ్చేసరికి కూతురు ఇంట్లో లేదని గ్రామంలో, బంధువుల ఇండ్ల వద్ద వెతికిన ఆచూకీ లభించనందువలన తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు.

బార్లను తలపిస్తున్న వైన్ షాపులు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలో వెలసిన వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయని ఎక్కడ కూడా ప్రభుత్వ నిబంధనలు అమలులో లేవని ఎక్సైజ్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డుకు వంద మీటర్ల దూరంలో వైన్ షాపులు ఉండాలని అయితే నడి రోడ్డుపై వైన్ షాపులు వెలిశాయని దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తక్షణమే నిబంధనలు పాటించని మద్యం షాపులను సీజ్ చేయాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గం లో ఉన్న మద్యం షాపులు బార్లను తలపిస్తున్నాయని వైన్ షాపుల దగ్గర టెంట్లు వేసి మరి మద్యం సేవిస్తున్నారని ఇది ప్రభుత్వ నిబంధ నలకు వ్యతిరేకమన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు మద్యాన్ని అధిక రేట్లకు విక్రయిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలో నడిరోడ్డుపై మద్యం షాపులు ఉండటం వల్ల మహిళలు ప్రజలు తీవ్ర భయాందోళన గురవుతున్నారని వారు అన్నారు. నిబంధనలు పాటించని మద్యం షాపులను సిజ్ చేయాలని వారు కోరారు. చాలా చోట్ల ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధికరేట్లకు మద్యాన్ని విక్రయిస్తున్నారని ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించాలన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు దుకాణాలను విసిట్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారన్నారు.

పొగాకు కంపెనీల నిర్లక్ష్యమే..!

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో పొగాకు కంపెనీల నిర్లక్ష్యం వల్ల మిడ్తూర్ మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన మంగలి రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన పొగాకు రైతు మంగళి రామకృష్ణ పురుగుల మందు తాగి గుంటూరు వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసుకొని గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, చికిత్స పొందుతున్న మంగలి రామకృష్ణ చౌట్కూరు గ్రామంలో తనకు గల 6ఎకరాల సొంత భూమితో పాటు మరో 16ఎకరాలు ఆంజనేయస్వామి దేవాలయంకు చెందిన మాన్యం భూమిని కౌలుకు తీసుకొని జిపిఐ, అలయన్స్ వన్ కంపెనీలకు చెందిన పొగాకు పంట వేశారన్నారు. పంట కోసం పెట్టుబడిగా, కౌలు చెల్లించుటకు సుమారు 30 లక్షల వరకు ఈ సంవత్సరం అప్పులు చేశాడనీ,గత మూడు, నాలుగు సంవత్సరాల నుండి కౌలు వ్యవసాయంలో పంటలు పండించుటకై లక్షల రూపాయలు అప్పులు చేసినా పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక కనీసం పెట్టుబడులు రాక అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాడని, ఈ సంవత్సరం పొగాకు పంట బాగా పండినా కూడా సకాలంలో అగ్రిమెంట్ కుదుర్చుకున్న జిపిఐ, అలయన్స్ కంపెనీలు తమ వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయకపోవడం వల్ల, అనేకమార్లు కంపెనీల ప్రతినిధులు ఇళ్ల చుట్టూ తిరుగుతున్న కొనుగోలు చేయకపోవడం, గత నెలలో కురుస్తున్న వర్షాల వల్ల పొగాకు నాణ్యత దెబ్బ తింటిందేమోనన్న భయం, మరోవైపు అప్పులు ఇచ్చినవాళ్లు ఒత్తిడి చేయడంవల్ల గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా స్థానికులు సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్చడం వల్ల ప్రస్తుతం గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. రైతు మంగలి రామకృష్ణకు భార్య ప్రమీలతో పాటు ఒక కుమారుడు, కుమార్తె, తమ్ముడు, నాన్న ఉన్నారని వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆవేదనతో తెలిపారు. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రామకృష్ణకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పొగాకు కంపెనీలపైన కఠిన చర్యలు తీసుకుని పొగాకు కొనుగోలు చేయించాలని, వ్యవసాయం కోసం చేసిన అప్పులు చెల్లించుటకు తగిన ఆర్థిక సహకారం అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

రెవెన్యూ ఆదాయాన్ని పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో జీఎస్టీ రెవెన్యూ ఆదాయాన్ని పెంచడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జిఎస్టీ ఆదాయాన్ని పెంచడానికి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 12,033 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అందులో ఉన్న సిబ్బందికి ప్రొఫెషనల్ టాక్స్‌లోకి వచ్చారా లేదా అనేది చూడాలన్నారు. ముఖ్యంగా వస్తువుల(గూడ్స్)కు సంబంధించి రూ.40 లక్షలు, కాంట్రాక్ట్ సర్వీసులకు సంబంధించి రూ.20 లక్షలు దాటిన వారి వివరాలు తెలపాలన్నారు. జిల్లాలో పాత బకాయిలకు సంబంధించి పెండింగ్ ఉన్న వసూళ్లకు వెళ్లేటప్పుడు రెవెన్యూ, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం మైనింగ్ లీజులున్నాయని, వారి నుండి అందుకు తగిన జీఎస్టీ పన్ను వసూలు చేసేలా చూడాలన్నారు. ఒక కాంట్రాక్ట్‌కు సంబంధించి రూ.2.5లక్షలు దాటితే 1 శాతం సిజిఎస్టీ, 1శాతం ఎస్జీఎస్టీ వసూలు చేయాలన్నారు. అదే విధంగా ప్రతి నెల 10వ తేదిలోపు జిఎస్టీ 7ఆర్‌ను ఫైల్ చేయాలని లేని యెడల ప్రతి రోజు వంద రూపాయలు చొప్పున సంబంధిత డిడిఓ నుండి వసూలు చేయడం జరుగుతోందన్నారు. అంతకు ముందు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ ఎం.సుధాకర్ రావు, డిప్యూటీ కమీషనర్ పి.సురేష్ లు వాణిజ్య పన్నుల శాఖ విధి, విధానాలు, జిఎస్టీ నిర్వహణ, జిఎస్టీ ట్యాక్సేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, నంద్యాల వాణిజ్య పన్నుల శాఖ 1, 2 సహాయ కమీషనర్లు లక్ష్మీనాయక్, సుజిత, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ కమీషనర్లు, ఎల్డిఎం, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో బుధవారం స్టేట్ బ్యాంకు 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు కలిసి పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. నంద్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొని దాతల నుండి రక్తాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఏర్పాటై 70సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ సంస్థలో పనిచేసే అధికారులు, సిబ్బంది అందరు స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేసేందుకు ముందుకు రావడం పట్ల మేనేజర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ పర్ల దస్తగిరి, సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వీరేష్, యోగా నరసింహ, గురప్ప నాగేంద్ర, విజయకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతులు పాటించండి



విశాలాంధ్ర - కోవెలకుంట్ల : రైతులు వ్యవసాయంలో పంట మార్పిడి పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో బుధవారం మండల టిడిపి నాయకుడు గడ్డం అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలిస్తే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట సాగు సమయంలో తగినంత మోతాదులో రసాయనకి ఎరువులు వాడాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు వాడటం వలన భూ విస్తరణ తగ్గుతుందని దీనివలన పంట దిగుబడి తగ్గుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా శనగ పంట సాగుకు ముందు మినుము, కొర్ర, పెసర వంటి పంటలు జూన్ జూలై నెలలో శనగ పంటకు ముందు ఈ పంటలు వేసుకుని అధిక లాభాలు పొందవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

విశాలాంధ్ర - పాములపాడు : రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని చెలిమిళ్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు మురళి కృష్ణ, ఆత్మకూరు డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకులు ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో అధికంగా రసాయనిక ఎరువులు ఉపయోగిస్తున్నారని దానివల్ల భూసారం తగ్గడం జరుగుతుందని అందుకే రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు ముగ్గు చూపాలని ఆరు తెలిపారు.

ఫెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : నియోజకవర్గంలో ఉన్న సీడ్స్, పెస్టిసైడ్స్ నిర్వహించే దుకాణ దారులు దనర్జనే ధ్యేయంగా రషీదులు తారుమారు చేస్తూ అధికరేట్లకు విత్తనాలు అమ్మి రైతులని మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, బయో మందులతో రైతులను నట్టేట్ట ముంచుతున్నారని తక్షణమే విజిలెన్స్ అధికారులు ఆరు మండలాలల్లోఉన్న ప్రతి షాప్‌పై దాడులు నిర్వహించాలని అక్రమాలకు పాల్పడుతున్న దుకాణాలను సీజ్ చేయాలని, వారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలోవ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు అన్నారు. బుధవారం జూపాడు బంగ్లా లోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. నియోజకవర్గంలో పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాల అక్రమాల విషయంపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాగబుల్ బాషా, పుల్లయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు దుష్పరిణామాలపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ.మోహన్ రెడ్డి అన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సుపెరింటెండెంటు ఎస్ రవి కుమార్ వారి ఆదేశాల మేరకు ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ.మోహన్ రెడ్డి వారి సిబ్బందితో కలిసి శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు మాదక ద్రవ్యముల వినియోగము, వాటి దుష్పరిణామాలు, గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కాలేజీ లెక్చరర్లు పాల్గొన్నారు. తదుపరి ఎవరైనా మాదక ద్రవ్యములు తయారుచేసిన రవాణా చేసిన అమ్మిన సమాచారం కొరకు 14405, 9440902585, 8328307774, 9177299067 అందించాలన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రక్త హీనత రాకుండా చర్యలు

విశాలాంధ్ర - వెలుగోడు : గిరిజన ప్రభావిత ప్రాంతంలో సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి సోకకుండా, అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ పేర్కొన్నారు. వెలుగోడు పట్టణం లోని విజయదుర్గ చెంచు కాలనీ, జగనన్న కాలనీ వద్ద గల చెంచు కాలనీ లను డిఎంహెచ్‌ఓ బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపులోకి మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ళనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట,తరుచుగా వచ్చే అంటువ్యాధులు లక్షణాలు కలిగిన సికిల్ సెల్ ఏనిమియా వ్యాధి సోకినట్లు గుర్తించి, వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించాలని అన్నారు. నంద్యాల జిల్లాలో 40వేల మందికి పరీక్షలు నిర్వహించి, 12 మందికి రక్త కణాల లోపం ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసన్న లక్ష్మి , సుధా ప్రణీత, సి.హెచ్.ఒ నాగేశ్వర రావు,సూపర్వైజర్లు మధు సుధన్, శ్రీదేవి ఎఎన్ఎందుర్గమ్మ, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగుల విందువీడియోపై విచారణ చేపట్టాం

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఉపాధి ఉద్యోగుల మద్యం విందు వీడియో వెలుగు చూసిన ఘటనపై ఉన్నత అధికారులు విచారణ చేపట్టారని ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈనెల 19వ తేదీన ఓ గ్రామ పరిధిలోని మామిడి తోటలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన విందులో ఉపాధి ఉద్యోగులు పనివేళల్లో మద్యం సేవిస్తూ ఉపాధి పనుల అవినీతిపై చర్చిస్తున్న వీడియో వెలుగు చూసింది. ఉపాధి ఉద్యోగుల మద్యం విందు వీడియోపై పలు పత్రికలలో కథనాలు వెలువడి దుమారం చెలరేగడంతో ఉన్నత అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం పీడీ సత్యనారాయణ మద్యం విందులో పాల్గొన్న ఏడు మంది ఉపాధి ఉద్యోగులతో పాటు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లకు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. నోటీసుల అందుకున్న మూడు రోజులలోపు వారు పీడీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మద్యం విందులో పాల్గొన్న ఉపాధి ఉద్యోగులు ఈసీ చిన్న రంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఓబులేసు, రంగన్న, మునిరాజు, కంప్యూటర్ ఆపరేటర్లు సుబ్బరాయుడు, పెద్దయ్య, నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు మాబు, నాగేశ్వర్ రెడ్డిలు నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

త్వరగా గృహాలు నిర్మించుకోండి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండలంలోని కృష్ణాపురం లేఔట్ నందు మంజూరు అయ్యి వివిధ నిర్మాణ దశలలో ఉన్న బీసీ,ఎసి, ఎస్టి లబ్దిదారులకు అదనపు ఆర్థిక సాయం క్రింద అమౌంట్ క్రెడిట్ అయినందువలన లబ్దిదారులకు జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిగోపాల్ గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అవగాహనా కల్పించారు. డిఈ నాగరాజు,ఎ.ఇ ఉమా మహేశ్వర రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు నాయక్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు

విశాలాంధ్ర-మిడుతూరు : నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో 28వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు విభిన్న ప్రతిభావంతులకు, వృద్ధులకు పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వము ఏడిపిఐ స్కీం కింద పరికరములు ఉచితంగా అందించనున్నట్లు ఎంపీడీవో దశరథ రామయ్య ప్రకటనలో బుధవారం తెలిపారు. మండలంలో అంగవైకల్యం కలిగిన, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ఉచిత పరీక్షల నిర్వహించి వారికి అనుగుణంగా పరికరాలను ఏడిపిఐ ప్రభుత్వ స్కీం కింద అందజేస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ప్రజా సమస్యల కోసం సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నంద్యాల పట్టణ సీపీఐ శాఖ సమావేశాలలో భాగంగా బుధవారం ఆదర్శనగర్, బాలాజీ కాంప్లెక్స్ సీపీఐ శాఖ సమావేశం పద్మావతి అధ్యక్షతన జరిగింది. సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.నాగరాముడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో 9మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా నారాయణమ్మ, సహాయ కార్యదర్శులుగా చాంద్ బాషా, పద్మావతిలను ఎన్నుకున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 26, జూన్ 2025

సమ సమాజ స్థాపనే సీపీఐ ధ్యేయం

విశాలాంధ్ర-పత్తికొండ: సమ సమాజ స్థాపనే సిపిఐ ధ్యేయం అని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజసాహెబ్ అన్నారు. బుధవారం మద్దిగేరి సిపిఐ శాఖా మహాసభ శాఖ కార్యదర్శి ఇలియాస్ భాష అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నేతృత్వంలో అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగిందన్నారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో భూ సంస్కరణల చట్టం తీసుకువచ్చి భూమిలేని నిరుపేదలకు లక్షలాది ఎకరాలు భూములు పంపిణీ చేసిన ఘనత సిపిఐకే దక్కింది అన్నారు. అర్హత కలిగిన ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమాలు చేపట్టే సిపిఐ మండల, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుమంచి, జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, ప్రజా సంఘాల నాయకులు నాగిరెడ్డి, నెట్టికంటయ్య, సిద్ధ లింగప్ప,ఉపేంద్ర, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణంలోని ఒకటవ వార్డులో అక్బర్ నగర్ కాలనీలో సీపీఐ మహిళా కార్యకర్తల ఆధ్వర్యంలో సీపీఐ మహాసభను నిర్వహించారు. బుధవారం కాలనీ శాఖ మహిళా నాయకురాలు సువర్ణమ్మ అధ్యక్షతన జరిగిన మహాసభకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు బి కృష్ణ, మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మద్దూరు చిన్న రాముడులు హాజరయ్యారు. మహాసభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ వచ్చేనెల జూలైలో సీపీఐ కర్నూలు జిల్లా మహాసభలు, అలాగే ఆగస్టులో సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా కోడుమూరు పట్టణంలోని సిపిఐ శాఖల గ్రామస్థాయి కార్యకర్తలను సమీకరించి సీపీఐ శాఖ మహాసభలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో, వర్కూరు గ్రామంలో మహాసభలు నిర్వహించామన్నారు. ఈనెల చివరికి కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మహాసభలు పూర్తిచేసుకుని,జిల్లా మహాసభలకు సిద్ధం కావాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చి పథకాలను అమలు చేయడం లేదన్నారు. మాయ మాటలతోనే సరిపెడుతూ,అన్నదాత సుఖీభవ పథకం ప్రతి రైతుకు అందాలని,పేదలైన ప్రతి ఒక్కరికి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు,ఇళ్ల నిర్మాణ అనుమతివ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మహాసభలో నూతన కమిటీ ఎన్నికల భాగంగా అక్బర్ నగర్ కాలనీ శాఖ కార్యదర్శిగా చాంద్ బాషా,సహాయ కార్యదర్శులుగా సువర్ణమ్మ,అరుణ్ భాష, కమిటీ సభ్యులుగా ఉరుకుందు, ఈరన్న,అక్బర్,నాగమ్మలను ఎన్నుకున్నారు. ఈ శాఖ ఇన్చార్జిగా తెలుగు వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ ప్రథమ చికిత్సపై పోలీసులకు శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు : సిపిఆర్, ప్రథమ చికిత్సపై జిల్లా పోలీసులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో ముందుండే జిల్లా పోలీసు సిబ్బందికి సీపీఆర్ ప్రథమచికిత్సపై అవగాహన కల్పించారు. ఏమి చేయాలి, ఏమి చేయకూడదో తెలిపారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు, స్పృహ తప్పి కోల్పోయినప్పుడు, హాస్పిటల్‌కు తీసుకువెళ్ళే 1గంటలోపు చేసే సీపీఆర్ విధానంపై జిల్లా పోలీసు లకు శిక్షణ , అవగాహన కల్పించడంతో పాటు పోలీసులచే ప్రాక్టీస్ చేయిస్తున్నామన్నారు. మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్ గారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సిపిఆర్‌పై అవగాహన ఉండడం ముఖ్యమన్నారు. ఎ సమయంలో నైనా ఉపయోగపడవచ్చన్నారు. ప్రతి కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. పోలీసులకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) మరియు ప్రథమ చికిత్స పై అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సహాయం చేయడంలో మొదటి ప్రతిస్పందనదారులుగా ఉంటారన్నారు. సీపీఆర్, ప్రథమ చికిత్స నైపుణ్యాలు కలిగి ఉండటం వలన, ప్రమాదాలు జరిగినప్పుడు లేదా గుండె పోటు వచ్చినప్పుడు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో బాగా ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. రూ.8వేల విలువ గల హెల్త్ చెకప్ మెడికల్ కూపన్స్ పోలీసులకు ఉచితంగా అందజేశారు. పోలీసుల కుటుంబ సభ్యులకు రూ. 8 వేల విలువ గల హెల్త్ చెకప్ మెడికల్ కూపన్స్ ను రూ.1000లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హెూంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్, పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డిఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్ రావు, ప్రసాద్, సిఐలు తేజమూర్తి, మన్సురుద్దీన్, అబ్దుల్ గౌస్, నాగరాజా రావు, రామానాయుడు ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ సంస్థల నిర్వహణకు సిఫార్సులు

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లాలో అర్హత కలిగిన 6 బాలల సంరక్షణ సంస్థలను నిర్వహించేందుకు సిఫార్సు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అనుమతులు జారీ చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బాలల సంరక్షణ సంస్థల జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ చట్టం 2015 ప్రకారం అర్హత కలిగిన బాలల సంరక్షణ సంస్థల కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేసి సిఫార్సులు చేయడం జరుగుతుందన్నారు..ఆ మేరకు జిల్లాలో ప్రభుత్వం, ఎన్జీఓల ద్వారా నడిపిస్తున్న 9 బాలల సంరక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోగా, నిర్దేశించిన ప్రమాణాల మేరకు వాటిలో ఉన్న వసతులను పరిశీలించడం జరిగిందన్నారు. ఇందులో 6 సంస్థలు అర్హత కలిగినవిగా సిఫార్సు చేశామని కలెక్టర్ తెలిపారు. జువెనైల్ అబ్జర్వేషన్ హెూమ్, శిశు గృహాల నిర్వహణ గురించి కలెక్టర్ ఐసీడీఎస్ పీడీని అడిగి తెలుసుకున్నారు.. పిల్లలకు ఇబ్బంది కలగకుండా బాలల సంరక్షణ సంస్థలను సక్రమంగా నడపాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, జువెనైల్ శాఖ జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ దివాకర్, ఐసిడిఎస్ పిడి నిర్మల, జుబేదా బేగం, డిసిపిఓ శారద, , జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ సునీత, అబ్జర్వేషన్ హెూమ్ సూపరింటెండెంట్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు యస్.రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖల అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు ప్రదేశాలను పరిశీలించారు. ఆనంద్ థియేటర్ వద్ద కిసాన్ ఘాట్ - బంగారు పేట వెళ్ళే రహదారిలో, కొత్త బస్టాండ్ సుందరయ్య కూడలి, వై.జంక్షన్ ప్రాంతాల్లో కూడళ్ళ ఏర్పాటుకు, గాయత్రీ ఎస్టేట్ విశ్వేశ్వరయ్య సర్కిల్ నందు కూడలి కుదింపునపు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి యస్ఈ మహేశ్వర్ రెడ్డి, డిఈఈ సాయిరాం, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, డిఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ ఖాసిం వలి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - నందవరం: అధిక ధరలకు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సరిత హెచ్చరించారు. బుధ వారం మండల పరిధి లోని నాగలదిన్నెలో ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు జరగాలని, అధికంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని, రైతులు విత్తనాలు కొనే సమయంలో రసీదును తప్పకుండా తీసుకో వాలని, రైతులు రసీదును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్ర పరచుకోవాలన్నారు. నదికైరవాడి గ్రామం పొలం పిలుస్తోంది కార్యక్రమం పాల్గొని, ప్రత్తి పంటలో తోలి దశలో వచ్చే రసం పీల్చే పురుగులు, వేరు కుళ్ళు తెగులు, వడ తెగులు, ఆకు మచ్చ తెగులు వంటి వాటి లక్షణాలు, వాటి నివారణ, సస్య రక్షణ గూర్చి మరియు పంట పొలంలో అక్కడక్కడ పసుపు, నీలం జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలు నిర్మించండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : 27వ వార్డు ఆదిత్య నగర్ నందు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని నగరపాలక మేనేజర్ యస్.చిన్నరాముడుకు స్థానికులు విన్నవించారు. బుధవారం నగరపాలక కార్యాలయం లో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికు లు మాట్లాడుతూ తమ ఇంటి ఎదురుగా ఖాళీ స్థలాలు ఉన్నాయని, వర్షం కురిసినప్పుడు అక్కడ వర్షపునీరు చేరి దోమలు ప్రబలుతున్నా యని వాపోయారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిముక్కలు పెరిగి పాములు, తేలు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే తమ కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు రాఘవేంద్ర, యాకూబ్ హుస్సేన్, కృష్ణ, మేనేజర్‌ను తదితరులు కోరారు.

వైభవంగా శ్రీశైలం తాత రథోత్సవం

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని ములుగుందం గ్రామంలో కొలిచేవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీశైలం తాత రథోత్సవాన్ని ఆలయ నిర్వహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం శ్రీశైలం తాత 14వ ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో తాత సమాధికి ఉదయం గంగపూజ, ఆకు పూజ, మహా మంగళహారతి తదితర విశేష అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉన్న రథోత్సవాన్ని అనేక రకాల పుష్పాలతో అలంకరింపజేశారు. అనంతరం శ్రీశైలం తాత ఉత్సవ విగ్రహాలను రథంపై ఆశీనులను చేసి గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించి తిరిగి యధా స్థానానికి చేర్చారు. రథోత్సవ వేడుకలు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. టచ్ చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సీఐ మస్తాన్ వలి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి,, మల్లికార్జున రెడ్డి, చిన్నాయప్ప, పూజారి రవి స్వామి, రంగస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ మాజీ గవర్నర్లు కొనియాడారు. బుధవారం లయన్స్ రీజియన్ సమావేశం ఐ.ఎం.ఏ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ క్లబ్ ద్వారా సేవలందించిన లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌ను మాజీ గవర్నర్లు డాక్టర్ బాల మద్దయ్య, లయన్ దుర్గ నాగేశ్వరరావు, లయన్ డాక్టర్ రవికృష్ణ ,లయన్ నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ రాహుల్ ,లయన్ రామరాజు, లయన్ పద్మశాలి వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల ,డోన్ ,ఆదోని తదితర లయన్స్ క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు లయన్స్ మెంబర్లు కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అనాధ పిల్లలకు ఆధార్ కార్డులు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో నివసిస్తున్న ఎంతో మంది అనాధ పిల్లలకు ఆధార్ కార్డులు లేవు. దీంతో వారికి పింఛన్, రేషన్ తదితర సంక్షేమ పథకాలు అందడం లేదు. వారికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.లీల వెంకట శేషాద్రి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అనాధ పిల్లలను గుర్తించి ఆధార్ కార్డులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాధికార కమిటీ సభ్యులు డాక్టర్ లయన్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బంగారు పేట, భాగ్యనగర్ సచివాలయాల పరిధిలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి ఆధార్ కార్డు గుర్తింపు లేని 20 మంది పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆనందమ్మ, మీనాక్షి, బంగారుపేట సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ మోనాలి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సాగు చేసిన పంటలకు రసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకముతో అధిక దిగుబడులు సాధించుకునేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని ఏడిఏ బలవర్ధిరాజు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పర్వతాపురం,కల్లుబావి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి బివిజి.సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ బలవర్ధిరాజు రైతులతో మాట్లాడుతూ పంట వ్యర్థాలను కుళ్ళింపజేసి పంటకు ఎరువుగా వినియోగిం చుకోవాలన్నారు. ప్రభుత్వం వ్యవసాయనికి అందించే అన్నదాత సుఖీభవ పథకానికి ఈ-కేవైసీ పెండింగ్లో ఉన్న రైతులు త్వరగా ఈ-కేవైసీ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉద్యాన అధికారి రఘువరన్ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్ వంటి పరికరాలకు రాయితీ పట్ల రైతులకు వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి విమలబాయి, ఆత్మ ఏటీఎం రామాంజని,ఏఈఓ సతీష్, ఎంపిఈఓలు భార్గవి, అయ్యన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే తన లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గ్రామాభివృద్ధే తన లక్ష్యమని సర్పంచ్ రామాంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, ఎంపీడీఓ కార్యాలయం రహదారి, కురువ కాలనీలోని డ్రైనేజీలలో పూడికతీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజలు ఆరోగ్యంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరావును పలువురు ఘనంగా సన్మానించారు. బుధవారం కర్నూలులోని అయన కార్యాలయంలో మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నారాయణ తదితరులు శాలువా పూలే బొకేలతో ఘనంగా సన్మానించారు.

మధ్యాహ్నం భోజనం ఆకస్మికంగా తనిఖీ

విద్యార్థులతో కలసి భోజనం చేసిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - ఆదోని : నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హై స్కూల్ లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఈవో శామ్యూల్ పాల్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం, అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై సామాజిక మాధ్యమంలో వస్తున్న వార్తలను చూసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరు పట్టిక, భోజనానికి సంబంధించిన రికార్డ్స్ తనిఖీ చేసి, విద్యార్థులతో ప్రభుత్వ అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని గూర్చి చర్చించడం జరిగిందన్నారు. ఏదైనా సమస్యలు ఉన్నాయా, విద్యార్థులకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి పాఠశాల పాటించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ వెంకటరమణారెడ్డి, హెచ్ఎం ఫయాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : భూసార పరీక్షల నమూనాల ప్రకారం రైతులు తమ పొలాలకు ఎరువులను వాడాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. బుధ వారం మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో పొలం పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ ఇదివరకు రైతుల పొలాలలో మట్టిని సేకరించి భూసార పరీక్షల కొరకు ల్యాబ్ లకు పంపించడం జరిగిందని దాని ఆధారంగా వచ్చిన భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందించారు. భూసార పరీక్ష నమూనాల్లో చూయించిన ప్రమాణాల ప్రకారం రైతు సోదరులు ఎరువులు తగిన మోతాదుల్లో సూక్ష్మ పోషకాలు కలిగి ఉన్న మరియు నత్రజని, భాస్వరం, పొటాష్ భూసారపరీక్ష పత్రాల ఆధారంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. గుండ్రేవుల, ఎనగండ్ల గ్రామాలకు సంబంధించి 1233 మంది రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరు అయిందని ఇప్పటివరకు 1214 మంది ఈ కేవైసీ వేలిముద్రలు పూర్తి చేయడమైనదని మండల అధికారి తెలియజేశారు. అదేవిధంగా మండలంలో 10229 మంది రైతుల కుటుంబాల గాను అన్నదాత సుఖీభవ పథకం మంజూరైనది, ఇప్పటివరకు 10064 మంది రైతులు ఈ కేవైసీ పూర్తి చేయడమైనది. ఈ నెల చివరి వరకు ఈకేవైసి పూర్తి చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి రైతులకు తెలియజేశారు. అర్హులైన అందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంవత్సరానకు 20,000 చొప్పున అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం కింద రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతుంది అని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు, అదేవిధంగా రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ సిబ్బంది ఎంపీఈఓలు సోమేశ్వరి మరియు ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలోని రైతులందరూ ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలోని సిబ్బంది సేవలను వినియోగించుకుని, వారి సలహాలు,సూచనలు పాటించి పంటల సాగులో అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయాధికారి ఎన్ రవిప్రకాష్ గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామ పరిధిలోని పంట పొలాల్లో రైతులకు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.గ్రామ రైతులు సాగు చేసిన పత్తి,కంది తదితర పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో కలిసి రైతులతో సమావేశమాయ్యారు. ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ పత్తి,కంది పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు.రైతులు సాగుచేసిన పత్తి,కంది,సద్దలు, ఆముదాలు వంటి తదితర పంటలు బాగున్నాయన్నారు.గ్రామ పరిధిలో ఉల్లి,పొగాకు పంటలు వేసేందుకు రైతులు భూములను చదును చేసుకుని సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాబట్టి రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆయా గ్రామాల్లోని రైతులను సమీకరించి తరచూ వారితో సమావేశాలు ఏర్పాటు చేసుకొని పంటల సాగుపై సలహాలు,సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రదీప్, రాజేష్, రైతులు సద్దల నాయుడు,చింతమాను మాధవస్వామి, మనోహర్,భక్షాల గిడ్డయ్య,నాగార్జున రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల పెన్షన్ రూ.7వేలకు పెంచాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు: ఆదిమ సాంప్రదాయ కళాకారులైన డప్పు కళాకారుల పెన్షన్‌ను రూ.7 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్ మండలం, ఎన్ కొంతలపాడు గ్రామం లో 100 డప్పులతో గ్రామ ప్రారంభంలో ఉన్న ప్రభుత్వ స్కూల్ నుండి గ్రామం మొత్తం డప్పుల దరువులతో ప్రదర్శన నిర్వహించి, ఎస్సీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కెవిపియస్, ఎపిడికేయస్ నూతన ఫోల్‌కు ఎపిడికెయస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ పతాకాన్ని ఎగురవేశారు. ఎపిడికెయస్ జిల్లా అధ్యక్షులు జే మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి జి.నాగన్న మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డప్పు, చర్మ కారుల పెన్షన్ ఆన్లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. డప్పు పెన్షన్ దరఖాస్తు వయసును 45 సంవత్సరాలకు తగ్గించడంతో పాటు, పెన్షన్ ను 7 వేలకు పెంచాలన్నారు. డప్పు కళాకారుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 26 నుండి జూలై 01 వరకు సచివాలయాలలో అర్జీలు ఇవ్వాలన్నారు. జూలై 02న కర్నూలులో జిల్లా కమిటి నిర్వహించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని నిర్వహించబోయే పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కెవిపియస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ పెద్దబాబు, మండల కార్యదర్శి గుట్టపాడు రామకృష్ణ, ఎపిడికె యస్ జిల్లా ఉపాధ్యక్షులు చిన్న మారయ్య, జే.వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శుల గురిగింజ నాగరాజు, మల్లెపోగు దస్తగిరి, జిల్లా కమిటి సభ్యులు మధు, బైరాపురం కృష్ణ, మంద మాదన్న, మండల నాయకులు మద్దిలేటి, సురేష్, రామాంజనేయులు, వివిధ గ్రామాల నుండి హాజరైన డప్పు కళాకారులు పాల్గొన్నారు.

చివరి గడప వరకు విద్యుత్ వెలుగులు

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల పరిధిలోని కోటపాడు గ్రామపంచాయతీలో సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప బుధవారం విద్యుత్ మరమ్మత్తు పనులను ముమ్మరంగా చేపించారు. గ్రామపంచాయతీ లోని పలు వార్డు వీధులలో విద్యుత్ బల్బులు కేబుల్ తదితర మరమ్మత్తు సమస్యలు ఎదురు కావడంతో గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ గుర్రప్ప తక్షణమే స్పందించారు. గ్రామపంచాయతీ నిధులు రావడానికి ఆలస్యం అయినప్పటికీ సొంత నిధులతో గ్రామ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా డి హుస్సేన్ బి గుర్రప్ప మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వాడ ప్రతి వీధిలో చివరి గడప వరకు విద్యుత్ వెలుగులు విరజిమ్మేళ తక్షణ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమై వాతావరణంలో మార్పు సంబంధించినందున క్రిమి కీటకాలు విషసర్పాలు సంచారం అధికంగా ఉంటుందని గ్రామ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి చెత్తాచెదారం నివాస ప్రాంతాల్లో లేకుండా అప్రమత్తంగా జాగ్రత్తగా ఉంటూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యం మెలకువలను పాటించాలని సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం మనోహర్ సీనియర్ నేత వంకదార పెద్ద సుబ్బు సత్యనారాయణ ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బచావో.. దస్తూర్ బచావో

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : వక్ఫ్ బచావో.. దస్తూర్ బచావో.. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనీ నంద్యాల ముస్లిం జేఏసీ డిమాండ్ చేసింది. నంద్యాలలోని దబ్ర మస్జిద్ నందు జరిగిన నంద్యాల ముస్లిం జేఏసీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్ మౌలానా జకీర్ హుస్సేన్ విచ్చేశారు. ఈ నెల 30వ తేదీన సాయంత్ర 5 గంటలకు ఎస్టీబిసి కళాశాల మైదానంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగే "వక్ఫ్ బచావో – దస్తూర్ బచావో" భారీ బహిరంగ సభ ను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 30న సాయంత్రం 5 గంటలకు ఎస్టీబిసి కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, దాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు "సేవ్ వక్ఫ్-సేవ్ కానిస్టిట్యూషన్" నంద్యాల, కర్నూలు జిల్లాల జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని కన్వీనర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు బహిరంగ సభకు చెందిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ బహిరంగ సభకు ఎంతోప్రాముఖ్యత ఉందని, ఇది ప్రశ్నార్థకమైన మనుగడ కోసమే అన్నారు. రాబోయే కాలంలో మసీదులు, మదరసాలు, కబరస్తాన్లు ఇవి ఏవి కూడా ఉండకుండా లాక్కోవాలనే కేంద్ర ప్రభుత్వ దుర్మార్గమైన వైఖరి చాలా స్పష్టంగా కనబడతుందన్నారు. దీనిని ముక్త కంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ఈ బహిరంగ సభకు అందరినీ ఆహ్వానిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, లౌకిక, ప్రజాస్వామ్య వాదులు, హిందూ సోదరులు, రాజ్యాంగ పరిరక్షకులు, న్యాయ కోవిదులు, మేధావులందరూ హాజరవుతారన్నారు. ఈనెల 30న సోమవారం సాయంత్రం 5 గంటలకు ఎస్టీబిసి కళాశాల మైదానానికి ప్రజానీకం అందరు కూడా చేరుకొని ఈ సభను విజయవంతం చేసి, కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి, ఈ నల్ల చట్టాన్ని రద్దు చేసేదాకా పోరాటాలకు తమ సహకారం, సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో నంద్యాల జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, జేఐహెచ్ అబ్దుల్ సమద్ , కో కన్వీనర్ మస్తాన్, ట్రెజరర్ బాష , మౌలానా ఇద్రీస్, ఎస్డిపిఐ ఎజాజ్, ఎఐఎంఐఎం అయూబ్, ఇబ్రహీం, మౌలానా రఫీ సిరాజీ, మౌలానా హుసేన్ రషాది, హఫీజ్ ముస్తఫా, హఫీజ్ ఇసాక్, హఫీజ్ అర్షద్, హఫీజ్ ముద్దసిర్, హఫీజ్ రహ్మతుల్ల తదితరులు పాల్గొన్నారు.

స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇచ్చి బదిలీలు చేపట్టాలి

విశాలాంధ్ర – చాగలమర్రి : గ్రామ,వార్డు సచివాలయాల అన్ని శాఖల ఉద్యోగులకు పదోన్నతుల చానెల్ కల్పించి,స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇచ్చి సర్వీస్ నిబంధనలు అమలు చేసిన తరువాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ సీనియారిటి,మెరిట్ జాబితా విడుదల చేసి పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లు,పెండింగ్ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏవిధంగా వినియోగించుకుంటుందో స్పష్టత ఇవ్వాలన్నారు. బదిలీ ఉద్యోగులు సొంత మండలాల్లో పని చేసుకునే అవకాశం కల్పించాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని విశ్వరూప నగర్లో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ దాతల సహకారంతో అందజేయడం జరిగిందని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ఉషారాణి తెలిపారు. ఆళ్లగడ్డకు చెందిన వ్యాపారవేత్త నిచ్చెన మెట్ల రామయ్య, అనసూయ దంపతులు వారి మనవడు అద్వైత్ పేరిట స్టడీ మెటీరియల్ పంపిణీకి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సునీల్, ఇన్నర్ వీల్ సభ్యులు గాయత్రి దేవి, రాధ, కవిత, సరోజ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర – చాగలమర్రి : ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓలు అనురాధ, న్యాంతుల్లాలు హెచ్చరించారు. బుధవారం ఎంఆర్‌సి కార్యాలయంలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పాఠశాల గవర్నింగ్ బాడీ నిర్దేశించిన ఫీజుల వివరాలను తరగతుల వారీగా నోటీస్ బోర్డులో తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్రం నిర్ణయించిన ఫీజులుకన్నా అధికంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆ పాఠశాల గుర్తింపును సైతం రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థలెవరూ పాఠశాల ఆవరణలో పుస్తకాలు, యూనిఫామ్లను విక్రయించకూడదని స్పష్టం చేశారు. అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర – కోవెలకుంట్ల : భారతదేశానికి రాజ్యాంగం ఒక గొప్ప హక్కుల మానవ పత్రమని కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంవిధాన్ హత్య దివాస్ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం గురించి వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ 1975లో విధింపబడిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యాన్ని పౌర హక్కులను కాల రాసిన ఘట్టం ఈ తరానికి అది తెలుసుకోవడం అత్యవసరమన్నారు. మన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. అనంతరం అధ్యాపకులు బి నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం మనకున్న అత్యంత శక్తివంతమైన పత్రిక సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలు ఇందులో నిక్షిప్తమయ్యాయని విద్యార్థులు రాజ్యాంగ అధ్యయాన్ని నిజమైన పౌర బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – మిడుతూరు : రోళ్ళపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి బుధవారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మన్య సూక్త హెూమం, పల్లకి సేవ, ఊయల సేవ తదితర విశేష పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిమ్మాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, సర్పంచ్ పే రెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం హత్యగావించిన దినం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : భారతదేశంలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో ప్రజలకు చీకటి రోజులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చూపించిందనీ బిజెపి సీనియర్ నాయకులు నరసింగరావు,నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. నంద్యాల జయంత్ హెూటల్‌లో సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఈ రోజును ప్రజాస్వామ్యం హత్యగావించిన దినంగా బీజేపీ ప్రభుత్వం నామకరణం చేసిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించి 20 నెలల పాటు భారతదేశానికి చీకటిరోజులు చూపించిందన్నారు. ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇండియా తప్ప మరో మాట మాట్లాడిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, స్వతంత్ర భావజాలం కల్గిన నాయకులు, పత్రికా స్వేచ్ఛను హరించివేస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛ, స్వతంత్రం లేకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకొని ప్రశ్నించే వారిని, కనిపించిన వారిని కనిపించినట్టే జైళ్లలో వేశారన్నారు. నిరంకుశ పాలన సాగించిన దినాన్ని బీజేపీ ప్రభుత్వ ప్రజాస్వామ్యం, హత్యగావించిన దినంగా ప్రకటించిందన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ చేయబడ్డ దేశభక్తులను గుర్తించి వారి త్యాగాన్ని కీర్తిస్తూ వారి కుటుంబసభ్యులను పండుగ వాతవరణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

వైసీపీయం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

విట్ యూనివర్సిటీలో ఉచితంగా బిటెక్ కోర్సు

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వెన్నెల అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎంపీసీ గ్రూపునందు అత్యధిక మార్కులు (976/1000) సాధించి నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో (23)ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఘనవిజయాన్ని సాధించినందుకు విట్ యూనివర్సిటీ అమరావతి యాజమాన్యం వారు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోను ద్వారా తమ శుభాకాంక్షలు తెలియజేసి విట్ యూనివర్సిటీ అమరావతి నందు ఉచితంగా బీటెక్ కోర్స్ చదువుకోవడానికి సీటు మంజూరు చేశామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని వెన్నెల మాట్లాడుతూ ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం కృషి వల్లనే తనకు ఈ అరుదైన అవకాశం దక్కినట్టు తన సంతోషాన్ని వెలిబుచ్చింది. గత సంవత్సరము కూడా ఇదే కళాశాల నుంచి నంద్యాల జిల్లాలో ప్రథమ స్థానంలో మార్కులు సాధించిన బి.గురుదేవి అనే విద్యార్థిని కూడా విట్ అమరావతి యూనివర్సిటీలో ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరము చదువుతున్నది. తమ కళాశాల నుంచి వరుసగా రెండు సంవత్సరాలు విద్యార్థులు నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకున్నందుకు ఇది తమకెంతో గర్వకారణమని ప్రిన్సిపల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం తెలియజేశారు.

భూసారం కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యం

విశాలాంధ్ర – చాగలమర్రి : అధిక రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి నేల ఆరోగ్యం మరియు భూసారం కాపాడుకోవడం రైతుల ప్రథమ కర్తవ్యమని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలియజేసారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సారవంతంగా లేనప్పుడు ఎన్ని ఎరువులు వాడినా అవి భూమిలో ఉండి మొక్కకు అందుబాటులో లేని స్థితిలో ఉండిపోతాయన్నారు. కనుక రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా పశువుల ఎరువు లేదా పచ్చి రొట్ట వాడకం వలన భూమి గుళ్ళబారి అవసరమైన సూక్ష్మ జీవులు వృద్ధి చెందడానికి తోడ్పడుతుందన్నారు. ఫలితంగా మనం వేసే ఎరువులు మొక్కకు అందుతూ పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించారు.అదే విధంగా మొక్కజొన్న, మినుము పంటలలో సమగ్ర కలుపు యాజమాన్యం గురించి వివరించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పంట భీమా కొరకు వేరుశనగ, అరటి పంటలకు భీమా చేయించుకొనుటకు రైతులు తమ వాటా ప్రీమియం ను అగ్రికల్చర్ ఇన్సురెన్స్ కంపెని వారికి మీ సంబంధిత మీ సేవా కేంద్రం నందు కాని ఆన్లైన్ లో కంపెని యొక్క పోర్టల్ నందు జులై 15 తేదీ లోపు చెల్లించవచ్చును అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించాలి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార భద్రత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆళ్లగడ్డ నియోజకవర్గం వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు, ప్రముఖ చిత్రకారుడు విజయ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విడిగా అమ్మే మిఠాయిలు ఎప్పుడు తయారు చేశారు, ఇప్పుడు వరకు నిల్వ ఉంటాయి అనే విషయాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఆహార భద్రతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా దుకాణాల్లో తేదీ మీరిన మిఠాయిలు విక్రయిస్తున్నారని తద్వారా వినియోగదారులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. రసగుల్లా, బాదం మిల్క్ రసమలై ఇలాంటి మిఠాయిలు తయారుచేసిన నాటి నుండి 48 గంటలు మాత్రమే తినేందుకు ఉపయోగపడతాయని లేదంటే అవి ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరంగా మారుతాయి అన్నారు. కొందరు వ్యాపారస్తులు స్వలాభం కోసం వినియోగదారులకు మిఠాయిలు అంటగడుతున్నారన్నారు. సాధారణంగా మనం కొనే తిండి పదార్థం, మందులు కొనే సమయంలో అవి తయారు చేసిన తేదీ, వాడకపు చివరి తేదీని చూసి కొనుగోలు చేస్తుంటామన్నారు. అయితే విడిగా అమ్మే మిఠాయిలపై ఇలాంటి తేదీలు ఉండవని విజయ్ అన్నారు. ఆహార భద్రత అధికారులు పేరుకు మాత్రమే కాకుండా తరచూ దాడులు నిర్వహిస్తే వినియోగదారుడు సైతం అవగాహనతో మెలిగిన నాడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడి

విశాలాంధ్ర – వెలుగోడు: మండలంలోని బోయరేవుల మరియు వెలుగోడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించటం జరిగింది. రైతు భరోసా కేంద్రం లో రైతులు సమావేశం నిర్వహించారు. ఎ. ఒ మాట్లాడుతూ కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రైతులకు తెలపటం జరిగింది. కౌలు కార్డు మరియు మినికిట్ లు పంపిణి చేయడం జరిగింది. వరి వేసుకొనే రైతులు సూడొమోనాస్ అనే బయో ఫంగీసైడ్ తో విత్తన సుద్ధి చేసుకోవాలని మరియు సల్ఫర్ వుండే ఎరువుల వాడకం వరి పంటకు తగ్గించాలని, సల్ఫర్ వలన మొక్క వేరు వ్యవస్థ దెబ్బతింటుంది, పెరుగుదల ఉండదు అని తెలపటం జరిగింది. ఈ కార్యక్రమం లో పశు సంవర్ధక ఎడిహెచ్ వెంకటేశ్వర్లు , వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ని కలిసిన నంద్యాల మార్కెట్ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, వైస్ చైర్మన్ రంగా ప్రసాద్, డైరెక్టర్లు పిట్టల మదర్, స్వామి నాయక్, రవి, నూర్ బాషాలు జిల్లా కలెక్టర్ ను కలిసి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయించాలని, మార్కెట్ యార్డ్ గోడౌన్లలో ఉన్న ఈవీఎంల గోడౌన్లకు బకా యిలు ఎన్నికల కమిషన్ చెల్లించలేదని వెంటనే ఇప్పించి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ను కమిటీ సభ్యులు కోరారు. మిర్చి కొనుగోలు కేంద్రంను మరింత అభివృద్ధి చేసి రైతులకు మార్కెట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. మార్కెట్ కమిటీ కోరిన విషయాలపై సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు.

బడి బయట పిల్లలను గుర్తించండి

విశాలాంధ్ర – రుద్రవరం : బడికి వస్తూ మానుకొని బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఎంఈఓ లక్ష్మి లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడి కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం లో బడికి వస్తూ బడి మానుకొని పని పాటలకు పోతున్న బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి గుర్తించా లన్నారు. గుర్తించిన బడి బయట పిల్లలను పాఠశాలలలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయ గ్రామాలకు చెందిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడి కార్యకర్తలు, సిఆర్పిలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన పరిష్కారానికి నోచుకోవడం లేదు

విశాలాంధ్ర – మిడుతూరు : గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన పరిష్కారానికి నోచుకోవడం లేదని సిపిఐఎల్ ఎంఎల్ లిబరేషన్ జిల్లా పార్టీ నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాసులకి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చుక్కల భూములు, అసైన్డ్ భూములు దాదాపు 40 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయని, ఈ భూములకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని రైతులు గ్రీవెన్స్‌లో వినతులు ఇచ్చిన పరిష్కారానికి నోచుకోవడం లేదని, అదేవిధంగా గ్రామాల్లో పట్టా భూములకు సంబంధించి ఆన్ లైన్ నమోదు, సవరణలు తదితర వాటిని పరిష్కరించకుండా వీఆర్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భూ సమస్యలు ఉన్న సుంకేసుల గ్రామానికి రెగ్యులర్ విఆర్ఓను నియమించాలని కోరారు. అనంతరం సమస్యతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తరిగోపులలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర – జూపాడుబంగ్లా : మండల తరిగొప్పుల గ్రామంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ మురళి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో తగ్గిందా రసానికి ఎరువులు వాడడం వల్ల భూమిలోని సారం తగ్గుతుంది అని ఆయన అన్నారు. అందువలన రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఆయన తెలిపారు. వివిధ పంటల యందు సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు.ప్రతి రైతు తప్పకుండా ప్రతి ఒక్కరు పంట నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ ప్రతి ఒక్క రైతు చేయించుకోవాలని వారికి తెలిపారు. కౌలు రైతులకు సంబంధించి కౌలు పత్రాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ డి.బాబు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఏజెంట్, వ్యవసాయ విస్తరణ అధికారి శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.